


అఖిల భారత పశుప్రదర్శన నగరంలో సంచలనం అయింది. పైగా, అది ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పెట్టడం అందరికీ మరింత అనుకూలంగా ఉంది. అందుకే పెద్దలు, పిల్లలు, యువకులు, విద్యార్థులు, రైతులు అందరూ ప్రదర్శనను తిలకించడానికి ఆసక్తి కనబరిచారు. ఎందుకంటే ఎప్పుడూ పరిశ్రమల్లో తయారయ్యే వస్తువుల్ని చూడటానికి అలవాటుపడిన జనుల నేత్రాలకు ఆ ప్రదేశంలో ఈ పశువుల్ని అందునా రకరకాల పశువుల్ని చూడటం ఎంతో మధురానుభూతిని కలిగించింది. అదీగాక వస్తువులు జీవం లేనివి. ఇవి జీవంతో ఉన్నవి. అందుకే పశువుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ అయింది.

దేశంలోని చాలా రాష్ట్రాల నుంచి రైతులు తమ పశువుల్ని ప్రదర్శనకు తీసుకువచ్చారు. ఒకవైపు ఎద్దులు - ఆవులు, మరొకవైపు గేదెలు - దున్నపోతులు. జనం నెమ్మదిగా చూసుకుంటూ వెళ్తున్నారు.

రేకుల షెడ్డుకింద రెండు ఎద్దులు ఠీవీగా నిలబడి ఉన్నాయి. కొమ్ములు నిటారుగా, వాడిగా నిక్కబొడుచుకున్నాయి. పక్కనే ఉన్న రైతు, జనం కేసి చూస్తూ ఉన్నాడు.

"మాది పక్క రాష్ట్రం. హళ్లికర్ జాతి ఎడ్లు బాబూ! మీరు మైసూర్ ఎద్దులు అని అంటారు. ఎంత బరువైనా లాగేస్తాయి!" అన్నాడు వివరిస్తూ.

ఎద్దుల్లో ఒక ఎద్దు కలగజేసుకుంది.

"అవునయ్యా! మాకు ఎంత తిండి పెడతాడో అంత పనీ చేయించుకుంటాడు మా చేత!" అంది నిష్ఠూరంగా.

సందర్శకులైన జనం 'అలాగా!' అనుకున్నారు. అనుకుని, అలా ముందుకు సాగారు.

అక్కడ రెండు గిత్తలు. పొట్టి కొమ్ములు, ఎత్తైన మూపురాలతో బలిష్టంగా ఉండి రాజసం ఒలకబోస్తున్నాయి. మెడలోని చిరుగంటలు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. అక్కడే ఉన్న యజమాని వాటిమీద చెయ్యి వేసి నిమురుతున్నాడు. ఎద్దుల పట్ల రైతు ఆప్యాయతను చూసి సందర్శకులు ముగ్ధులయ్యారు.

"ఒంగోలు గిత్తలు, బాబూ! గిత్తల్లో అగ్రశ్రేణులు. కాలు కదిపాయంటే మీ కార్లు ఎందుకూ పనికిరావు. రయ్‌మని పరుగెడతాయి. నువ్వు ఎంత బరువైనా వెయ్యి. లారీ కూడా బలాదూరే వీటి బండి ముందు! 'నమ్మినబంటు'

సినిమాలో వీటి నటన చూడాల్సిందే! కానీ, ఈ జాతి నానాటికీ అంతరించిపోతోంది, బాబూ!" అన్నాడు ఆందోళనగా.

వెంటనే గిత్త అందుకుని, "అది నిజమయ్యా! మాచేత 'బండెడు' పని చేయించుకున్నా బాధలేదు గానీ, మా వంశం నశించిపోతున్నదనే బెంగ. ట్రాక్టర్లు వచ్చాక మాకు సుఖం కలిగిందిలే, నాయనా!" అంది వాటిలో పెద్దదైన ఎద్దు కొంత ఆనందం, మరికొంత విచారంతో.

సందర్శకులకు వాటిమీద సానుభూతి కలిగింది. కొందరు మొసలి కన్నీరు కార్చారు. తర్వాత ముందుకు కదిలారు. అక్కడే పందిరికింద ఆవులు కొన్ని నల్లనివి, కొన్ని తెల్లనివీ. నల్లని ఆవు బలిష్టంగా ఉంది. పెద్ద పాలపొదుగుతో నిండుగా ఉంది. గడ్డి పరకలు నములుతోంది. కొంత దూరంలో లేగ(దూడ) గాటకు కట్టి ఉంది. అప్పుడప్పుడూ "అంబా!" అని అరుస్తోంది. దాని యజమాని రైతు దూడ తోకను పట్టుకుని సవరిస్తున్నాడు చంటిపిల్లను సాకినట్టుగా. చూపరులకు ఆ దృశ్యం ఎంతో కమనీయమనిపించింది.

"మమ్మల్ని మమ్మీ, డాడీలు కేర్‌సెంటర్లో వదిలేసి తమ ఆఫీసులకు వెళ్లిపోతారు గానీ, ఇలా ఎప్పుడైనా ప్రేమగా చూశారా?" అని అనుకున్నారు సందర్శకుల్లోని కొందరు బాలబాలికలు.

"డంగి జాతి ఆవు, బాబూ ఇది! నాసిక్ నుంచి వచ్చాం. పాలు బాగా ఇస్తాది!" అన్నాడు రైతు.

అతని మాటలకు ఆవు అందుకుంది "అవును, బాబూ! వాటితోపాటు మీకు మేము ఇచ్చేవి ఇంకా చాలా ఉన్నాయి. మీరు ఎప్పుడూ ధరిస్తూండే , ప్రతియేటా మీరు ఎగ్జిబిషన్లో చూసే రకరకాల పాదరక్షలు మా చర్మంతో తయారైనవే! మీకు వీనులవిందు చేసే వాద్య పరికరం 'డప్పు' మా చర్మంతో తయారైందే! మీరు ఎగ్జిబిషన్లో చూసి ఆనందించే అలంకరణ బొమ్మలు మా కొమ్ములతో తయారైనవి. ఇక మేము విడిచిపెట్టే గోమయం (పేడ) చేనుకు ఎరువుగా, మీ ఇంటి వాకిలిలో కళ్లాపిగా ఉపయోగపడుతోంది. ఇన్ని విధాల మమ్మల్ని ఉపయోగించుకుంటున్న మీరు, మమ్మల్ని కనికరంతో చూస్తే అంతే చాలు!" అంది గోవు గోముగా.

"అయ్యో! ఎందుక్కాదూ! నువ్వంటే మా కెంతో ఇష్టం!" ఆర్ద్రత నిండిన స్వరంతో అని, ముందుకు నడిచారు బాలలు తమ పెద్దల వెంట.

నేల చిత్తడిగా అక్కడక్కడా పేడ, గడ్డితో అదో రకమైన కంపు ఆవరించి ఉంది. ఆ వాతావరణం అంతా నగరం నడిబొడ్డు మీదకి జారిపడిన పల్లెలా ఉంది. సందర్శకులు ముందుకు

"నేను దేశదేశాలూ తిరిగాను. అందమైన అమ్మాయిలకు మాయమాటలు చెప్పి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని బొంబాయి, ఢిల్లీ నగరాలకు తీసుకెళ్లి దుబాయ్ షేక్‌లకు, బ్రోకర్లకు డబ్బుకి అమ్మేశాను. ఎంతోమందిని పెద్ద నగరాల్లోని వేశ్యావాటికల్లో పడుపు వృత్తిలోకి బలవంతంగా దించేశాను. అలా ఘనకార్యాలు చేశాను. అలా సంపాయించిన సొమ్ముని దుబాయ్ సెంట్‌లో ముంచి అనుభవిస్తున్నాను....."



సాగుతున్నారు.

రకరకాల ఆవుల తర్వాత గేదె పందిళ్లు మొదలయ్యాయి. గేదెలు నల్లని తారురోడ్డు రంగులో కొన్ని, ఎర్రని రంగులో కొన్ని! కొన్ని నిలబడి ఉన్నాయి, కొన్ని పడుకుని నెమరువేస్తున్నాయి. ఒక గేదె మెడలోని పూసల తాడుతో మోర ఎత్తిపట్టి స్తంభాన్ని అటూ ఇటూ గీరుతోంది. తలపాగాతో ఉన్న రైతు గేదె వీపుమీద ఉన్న మట్టిని చేత్తో గోకుతూ, దాని చెవిమీద కందిరీగ వాలితే చాచి ఒకటి వేశాడు. వెంటనే ఈగ చచ్చిపడింది.

"రైతులు ఆ మూగ జీవాల్ని ఎంతో ప్రేమగా చూసుకుంటారు. అవేమో గడ్డి తిని కమ్మని పాలు ఇస్తాయి. వాటిని రైతులు పట్నాలకు, నగరాలకు పంపిస్తే మనం మాత్రం కడుపారా తాగేసి నిలువెల్లా విషం పెంచుకుంటాం!" అని అనుకుంటూ కొందరు ఆత్మ విమర్శ చేసుకున్నారు.

"జాఫర్‌బాడీ జాతి గేదె, బాబూ! గుజరాత్ నుంచి వచ్చాం. రెండు బిందెల పాలిస్తుంది. పడుకోవటానికి పట్టు పరుపులడగదు. పౌడర్లు, పన్నీరు కావాలనదు. వేళకు కొన్ని పరకలు, కాసిన్ని నీళ్లు చాలు, అంతే!" అన్నాడు రైతు తన పాడి గేదెను పొగుడుతూ.

"అవునయ్యా... మేము పాలు మంచిగానే ఇస్తాం. మమ్మల్ని యజమానీ బాగానే చూస్తాడు. ఒంటిమీద ఈగ వాలనివ్వడు. కానీ ఉన్న మాట చెబుతాను... మా ఒంట్లో మార్పొచ్చి పాలివ్వటం మానేస్తే 'ఒట్టిపోయిన గేదె' అని ఎగతాళి చేస్తాడు. అదే మాకు బాధ!" అంది నొచ్చుకుంటూ.

గేదె బాధకు సందర్శకులకూ బాధ కలిగింది.

"నువ్వేం బాధపడకు! నీ మీద మాకు ఎప్పుడూ సానుభూతి ఉంటుంది. సందర్భం వచ్చినప్పుడల్లా మేము 'బర్రెలా ఉన్నావు' అని అంటూ నిన్ను గుర్తు చేసుకుంటూనే ఉంటాం. అయినా నీ పాలు లేనిదే మేము పొద్దున్నే ముఖం కూడా కడగం కదా!" అన్నారు జనం తెగ మెచ్చుకుంటూ. గేదెకు మహదానందం వేసింది.

జనం ముందుకు కదిలారు. దున్నపోతులు చిన్న కొండలవలె దర్శనమిచ్చాయి. ఒళ్లంతా నూనె రాసుకున్నంత నునుపుగా నిగనిగలాడుతున్నాయి. చప్పుడు రాకుండా నిలబడి నెమరువేస్తున్నాయి. అక్కడున్న నీళ్ల బక్కెట్టుని పక్కకు తీయటానికి దున్నపోతు తోక మెలిపెట్టి చేత్తో ఒకటి చరిచాడు రైతు. అది కదలలేదు. ఆ దృశ్యం చూసి కొందరు నవ్వారు.

"దున్నపోతు మీద వర్షం కురవటం అంటే ఇదే! లెక్కచేయదు!" అన్నారు ఎవరో వెటకారంగా నవ్వుతూ.

దున్నపోతుకి కోపం వచ్చింది.

"మీరు నవ్వక్కర్లేదు. పని చేసేటప్పుడు చేస్తాను. చేలో అరక కట్టి దుక్కి దున్నేటప్పుడు ఒళ్లు తెలియకుండా ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ, నేను ఎలా కష్టించి పనిచేస్తానో నా రైతుకే ఎరుక! కానీ, మీ మానవుల్లో కొందరు ఒళ్లు పెంచేసుకుని సోమరిపోతుల్లా తయారై పనిచేయటానికి నడుం వంచరు. మమ్మల్ని చూసి మీరు ఎంతో నేర్చుకోవాలి!" అంది ఆవేశంగా. ఆ మాటలకు అందరికీ సిగ్గేసింది.

"తప్పదు... యథార్థం ఒప్పుకు తీరాలి!" అన్నారు కొందరు.

"అవును, మొత్తమ్మీద ఈ పశుజాతి అంతా మానవులకు ఉపయోగపడేదే! ఎటొచ్చీ మానవజాతే అన్ని జాతులకూ అపకారం తలపెట్టేది!" అంటూ అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు.

అలా ప్రదర్శన చూసుకుంటూ చివరకు వచ్చేటప్పటికి ఒకచోట పందులు, ఇంకోచోట కోళ్లు, కుందేళ్లు దర్శనమిచ్చాయి. ఇనుప చట్రాల్లో ఉన్న పందులు కొన్ని నల్లనివి, కొన్ని తెల్లనివి. కోళ్లలో రకరకాల జాతులు. అసీల్ జాతి పుంజులు, దేశవాళీ పెట్టలు, రంగురంగుల ఈకలతో కోడిపుంజులు,

పాలవంటి తెలుపుతో కుందేళ్లూ ... అన్నీ చూడముచ్చటగా ఉన్నాయి.

సందర్శకుల ఉత్సాహాన్ని చూసి కుందేలు, కోడి వారి ముందుకు వచ్చాయి.

"మా జంతుజాలాలకు ఈ రోజుల్లో రక్షణ లేదు, నాయనా! మా జాతికే చెందిన దుప్పుల్నీ, నెమళ్లనీ క్రూరంగా చంపి తమ విలాసాలకోసం నటులూ, నాయకులూ, చివరకు మంత్రులు కూడా విందు భోజనాలు చేసుకుంటున్నారు. మున్ముందు మా జాతి కనుమరుగైపోతుందేమో అని మా ఆందోళన!" అన్నాయి కంట తడిపెడుతూ. వాటి ఆందోళనను అర్థం చేసుకున్న కొందరు తాము 'భూతదయ' కలిగి ఉంటామని, తోటి మానవుల్లో కూడా దాన్ని పాదుకొల్పుతామని హామీ ఇచ్చారు. ఆ మాటలకు వాటికి ఊరట కలిగింది.

"మొత్తమ్మీద ఇది మాత్రం మంచి ప్రదర్శన. పైగా వినూతనమైంది. రేపు ఈ ప్రదర్శనలో పాల్గొన్న మేలుజాతి పశువుల్ని ఎంపిక చేసి బహుమతులు ఇస్తారట!" అన్నారు ఒకరు. ఆ మాటలకు మిగతా అందరికీ సంతోషం కలిగింది. నిర్వాహకుల్ని మనసారా అభినందించి అక్కణ్ణుంచి నిష్క్రమించారు.

000 000 000

మరునాడు పశువుల్లో ఉత్తమజాతికి చెందినవాటిని ఎంపిక చేశారు న్యాయనిర్ణేతలు. నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, సందర్శకుల సమక్షంలో ఫలితాలను ప్రకటించారు.

"ఎద్దుల్లో ఒంగోలు జాతికి చెందిన ఎద్దు ఛాంపియన్! ఆవుల్లో దంగి జాతికి చెందిన ఆవుకు, గేదెల్లో ముర్రా జాతికి చెందిన గేదెకు ప్రథమ బహుమతి! దున్నపోతుల్లో జెర్సీ జాతికి చెందిన దున్నపోతుకు ప్రథమ బహుమతి!"

ఉన్నట్టుండి జనంలో కలకలం మొదలైంది. న్యాయ నిర్ణేతలు, నిర్వాహకులు ఉత్కంఠతతో జనంకేసి చూశారు.

ఒక గాడిద ఓండ్రపెడుతూ తమవైపే రావటం కనిపించింది. అందరూ ఆశ్చర్యపోయారు ఈ హఠాత్పరిణామానికి.


"మీరు ప్రకటించిన పశువుల బహుమతులు అక్రమం, అన్యాయం!" అంది బిగ్గరగా గాడిద.

ఆ మాటలకు నిర్వాహకులతోపాటు న్యాయనిర్ణేతలు కూడా దిగ్భ్రమకు లోనయ్యారు.

"మీ పశువుల ప్రదర్శనలో మేము కూడా భాగస్వాములమే!" అంది మళ్లీ గంభీరంగా.

"ఇవి జంతువులు కదా! ఇదెలా సాధ్యం?" అని అనుకున్నారు నిర్వాహకులూ, న్యాయనిర్ణేతలూ.

"నా కూడా రండి!" అంటూ గేటు బయటకు దారితీసింది గాడిద. అందరూ గాడిదను




అనుసరించారు. తీరా బయటకెళ్తే, అక్కడి దృశ్యాన్ని చూసి మరింత ఆశ్చర్యపోయారు.

అక్కడ సింహం, ఎలుగుబంటి, మళ్లపంది, తోడేలు, జిరాఫీ, ఖడ్గమృగం, దున్నపోతు... నక్క, పులి, అన్నీ జంతువులే! బారులు తీరి నిలబడి ఉన్నాయి. అందరికీ చూపించి గాడిద ఇలా అంది..

"మాదికూడా పశుప్రదర్శనే! మాకు బహుమతులు ఇవ్వాలి!"

సందర్శకులు విడ్డూరంగా చూశారు. నిర్వాహకులకు నోట మాట లేదు.

'ఇంతకాలం ఎగ్జిబిషన్ జరిగేటప్పుడు గేటు బయట మినీ ఎగ్జిబిషన్ (పిల్లప్రదర్శన) ఉండటం చూశాము గానీ, ఇలా పశు ప్రదర్శనప్పుడు 'పిల్ల పశుప్రదర్శన' జరగటం..!' అని ముక్కుమీద వేళ్లేసుకున్నారు.

దున్నపోతు గొంతు సవరించుకుని గంభీరంగా "మీరు ప్రకటించిన మేలుజాతి పశువుల్లో ఉత్తమ దున్నపోతు బహుమతి చెల్లదు! అది నాకు చెందాలి!"

"ఇంతకీ మీరంతా ఎవరు? మీ సంగతేమిటి?" అని నిలదీశారు.

"మా గురించి అంతా చెబుతాం, లోపలికి పదండి!" అంటూ దున్నపోతుతో సహా అన్ని జంతువులూ గ్రౌండ్ లోపలికి నడిచాయి. మిగతా అందరూ లోపలకు వెళ్లారు. న్యాయ నిర్ణేతలు, నిర్వాహకులు కుర్చీల్లో ఆసీనులయ్యారు. జంతువులు అతి వినయంగా నిలబడ్డాయి. న్యాయనిర్ణేతల్లో ఒకరు సావధానంగా అడిగారు

"మీరంతా జంతువులు. అయినా, మీ గొప్పతనం గురించి ఒక్కొక్కరూ వివరించండి!"

ముందుగా జిరాఫీ ఆరంభించింది "నేను దేశదేశాలూ తిరిగాను. అందమైన అమ్మాయిలకు మాయమాటలు చెప్పి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని బొంబాయి, ఢిల్లీ నగరాలకు తీసుకెళ్లి దుబాయ్ షేక్‌లకు, బ్రోకర్లకు డబ్బుకి అమ్మేశాను. ఎంతోమందిని పెద్ద నగరాల్లోని వేశ్యావాటికల్లో పడుపు వృత్తిలోకి బలవంతంగా దించేశాను. అలా ఘనకార్యాలు చేశాను. అలా సంపాయించిన సొమ్ముని దుబాయ్ సెంట్‌లో ముంచి అనుభవిస్తున్నాను. నన్ను చూస్తే తెలియటంలేదా? నా మెడ ఎంత అందంగా ఉందో... నా చారలు ఎంత ముద్దొస్తున్నాయో... అరచేతిలో స్వర్గం చూపించటం, తడిగుడ్డతో గొంతు కోయటం ... ఇవన్నీ నాకు వెన్నతోపెట్టిన విద్య!"

అంతా వ్రాసుకున్నాడు న్యాయనిర్ణేత.

"నా పేరు ఖడ్గమృగం. నా ముందున్న కొమ్మును చూశారుగా ... ఇది నా ఆయుధం! నేను భక్షకభట విధుల్ని నిర్వర్తిస్తాను. సహాయం కోసం మా దగ్గరకొచ్చినా, ఒకవేళ రాకపోయినా నేను వివాహిత, అవివాహిత స్త్రీలపై అత్యాచారాలు చేసి అనుభవిస్తూంటాను. నాతోపాటు ఇదిగో, ఈ నా సహచర మృగం కూడా మానభంగాల్లో పాలుపంచుకుంటుంది. ఎప్పుడైనా మందుకొట్టి విధుల్ని నిర్వర్తిస్తాం. ఇంకా టైముంటే బస్సుల్లో గానీ, రోడ్డుమీద గానీ ప్రయాణీకులు కనబడితే దోచుకుంటాం. ఇవి చాలా.... ఇంకా చెప్పాలా?" అర్థోక్తిలో ఆగిపోయింది ఖడ్గమృగం.

చాలు చాలన్నట్లు సంజ్ఞ చేశాడు న్యాయనిర్ణేత.

"నా పేరు తోడేలు. అందరికీ వైద్యం చేస్తాను. మాతో చాలామంది మూర్తీభవించిన సేవాతత్పరు లున్నారు. కానీ నాలాంటి కొంతమందిమి వైద్యంకోసం మా వద్దకొచ్చిన వాళ్లని మభ్యపెట్టి, మోసం చేసి ఆపరేషన్ అనీ, అదనీ ఇదనీ చెప్పి పొట్టలోంచి డబ్బుని తోడేసుకుంటూంటాం. మరి నా పేరు తోడేలు కదా! మనిషి బతికుండగానే శరీరంలోని అవయవాలు దొంగిలించేసి డబ్బుకి అమ్మేసుకుంటాం!" అంది తోడేలు, నవ్వుతూ.

"ఇంక తర్వాత...?" అన్నాడు న్యాయనిర్ణేత.

"నేను ముళ్లపందిని. వసతి గృహంలో భోజనాల ఏర్పాట్లు చేస్తాను. బీద విద్యార్థులకోసం పంపినవాటిని వాళ్లకు పెట్టకుండా, తరలించేసి వాళ్ల పొట్టలు కొట్టి నేను మేడలు కట్టుకున్నాను. ఎవరైనా అడ్డొస్తే కుక్క బిస్కెట్లులా కొంత పడేస్తూంటాను. ఇంకా వివరంగా చెప్పనా?"

"వద్దు వద్దు! తర్వాత?" అన్నాడు న్యాయనిర్ణేత.

"నేను పెద్దపులిని. క్రూరమృగాన్ని. నాకు దాహం ఎక్కువ. దాహమంటే మామూలు దాహం కాదు. వరకట్న దాహం. అంటే డబ్బు దాహం! స్కూటరు, ఫ్రిడ్జ్, కలర్ టీవీ, బంగారం, ఇంకా నా వ్యసనాలకు, భోగాలకూ అన్నిటికీ మూలమైన తనివితీరని కట్నదాహం. అందుకే నేను కట్టుకున్న భార్యను కిరోసిన్ పోసి తగులబెట్టాను. నాకు నా తల్లి మృగం, తండ్రి మృగం అందరూ

సహకరించారు. మరి నేను క్రూరమృగాన్ని కదా! బతికినప్పుడు కాల్చుకుతినటం, చివరకు కాల్చి చంపటం మా మృగాల హాబీ! ఇంకా నా అనుచరులు ఎందరో ఉన్నారు!" అని పంజా విసిరింది పులి.

"చాలు బాబో...! చాలు! తర్వాత...?" అన్నాడు న్యాయనిర్ణేత.

"నేను యువ ఎలుగుబంటిని మాట్లాడుతున్నా. నా ఒంటిమీద బొచ్చు, నా నోరు, పళ్లు చూశారుగా... నాకు పనీ పాట లేక తిండి ఎక్కువైనప్పుడు సరదాగా నా మిత్ర ఎలుగుబంట్లతో కలిసి పది సంవత్సరాల బాలికపై అత్యాచారం చేశా! అప్పుడప్పుడూ అలా చేయాలనిపిస్తుంది... ఎందుకో అర్థం కాదు!" ఉరుముతూ అంది ఎలుగుబంటి.

"నీ కర్థంకాదులే. చాలు...! తర్వాత?" న్యాయ నిర్ణేత.

"నేను రాజ్యానికి రాజుని. రాజులకు రారాజుని. అర్థమైందనుకుంటా... సింహాన్ని! నేను అరిస్తే గిరిస్తే పిలుపు వినపడినంత దూరం నాదే రాజ్యం. అంటే నాదే భూమి. అన్ని భూములూ నావే! అది ప్రభుత్వానిదైనా, ప్రైవేటుదైనా... ఆఖరికి పేదలదైనా ... అన్నీ నావే. నా కెదురు లేదు, ఆఁ!" అంది గర్జిస్తూ జూలు విదుల్చుకుని.

న్యాయనిర్ణేత తడబడ్డాడు. తర్వాత తమాయించుకున్నాడు.

కొన్ని క్షణాల వరకూ ఏ జంతువూ రాలేదు. నిశబ్దతకు అచ్చెరువొంది, కళ్లజోడు సవరించుకుని, కలం బుగ్గన అన్చి చూశాడు న్యాయనిర్ణేత.

ఎదురుగా ఉలుకూ పలుకూ, చడీ చప్పుడూ లేకుండా నిలబడి ఉంది దున్నపోతు.

"నీ పేరు దున్నపోతు. ఇది అందరికీ తెలుసు. అందుకే నువ్వు చెప్పుకోవటంలేదు!" అన్నాడు న్యాయనిర్ణేత.

అవునన్నట్టు తలాడించింది దున్నపోతు. తర్వాత చెప్పటం ఆరంభించింది

"నేను దున్నపోతును. నాకు చాలా గ్లామరుంది. సోమరిపోతుని, తిండిపోతుని, దేశదిమ్మరిని, నల్లతుమ్మమొద్దుని ... అడ్డగాడిదలా ... కాదు కాదు, మరో 'అర్థదున్నపోతు'లా అడ్డమైన చేలూ, గట్లూ, పుంతలూ, పెంటలూ తిరిగేసి కుప్పలు కుప్పలుగా తెప్పలు తెప్పలుగా గడ్డి తినేసి లంకగడ్డిసైతం ఆరగించేసి, మిగతా గేదెలకు, ఆవులకు పరక మిగల్చకుండా చేసి సముద్రం నీరు తాగేసి బ్రేవ్‌మని త్రేన్చాను. ఇదంతా మంది... కాదు, 'మంద'కోసం, తోటి పశువులకోసం, తోటి దున్నపోతులకోసం చేశాను. ఇలా నేను ఎంతో ఘనకీర్తి చెందాను. నాకు సన్మానాలు చేసి బహుమతులూ, అవార్డులూ ఇవ్వాలి. మీరు ప్రకటించిన ఉత్తమ దున్నపోతు, 'ఛాంపియన్' బహుమతి నాకే ఇవ్వాలి!" అంది ఆదేశిస్తున్నట్టుగా ఆవేశంతో.

న్యాయనిర్ణేత నిర్ఘాంతపోయాడు. అతనితోపాటు మిగతా న్యాయనిర్ణేతలూ, నిర్వాహకులూ కూడా. అందరూ దీర్ఘాలోచనలో పడ్డారు. ఈ కొత్త వింత దున్నపోతు తమమీద సవాల్ విసిరింది. అరగంట తర్వాత న్యాయ నిర్ణేతలు ఒక నిర్ణయానికి వచ్చి మరుసటిరోజు ఒక ప్రదేశంలో రెండు దున్నపోతులకూ పరీక్ష పెట్టబడుతుందని ప్రకటించారు.

ఆ ప్రకారం జంతువులు, పశువులు, అందరూ మరునాడు గ్రౌండ్‌లో సమావేశమయ్యారు. ఎవరు నెమ్మదిగా పచ్చగడ్డి తింటారో వారు నెగ్గినట్టు లెక్క అని చెప్పి రెండు దున్నపోతుల్నీ పచ్చికబయలులోకి వదిలారు (గమనిక: తను తక్కువ తిని తోటివారికి ఆహారాన్ని మిగిల్చేవారు ఉత్తములని న్యాయనిర్ణేతల సదభిప్రాయం."

పాతదున్నపోతు, కొత్త దున్నపోతు మేయటం ఆరంభించాయి. అందరూ చుట్టూ నిలబడి ఉత్కంఠతో చూస్తున్నారు. కొన్ని నిముషాలు గడిచాయి. ఉన్నట్టుండి పాత దున్నపోతు నురగలు కక్కుతూ కిందపడిపోయింది. అందరూ దిగ్భ్రమ చెందారు. దున్నపోతు చనిపోయింది! కొత్త దున్నపోతు మాత్రం మేత మేస్తూనే ఉంది. పాతదున్నపోతు ఎలా చనిపోయిందో ఎవరికీ అంతుబట్టలేదు.

"నాకు బహుమతి ఇవ్వండి. నేనే నెగ్గాను!" అంది కొత్త దున్నపోతు గంతులేస్తూ.

అందరికీ ఇందులో ఏదో మోసముందని అర్థమైపోయింది. కొత్త దున్నపోతుని నాలుగు తన్నారు నిర్వాహకులు. అప్పుడు అసలు రహస్యాన్ని బయటపెట్టింది.

"ఆ దున్నపోతుని చంపేస్తే బహుమతి నాకే వస్తుందన్న దుర్బుద్ధితో క్రితం రాత్రి పచ్చిక ప్రదేశంలో విషం చల్లాను. అందుకే అది అలా అయింది!" అంది ఏమాత్రం తొణక్కుండానే.

కొత్త దున్నపోతు నిర్భీతిగా, నిర్లజ్జగా అలా చెప్పేటప్పటికి అందరికీ అంతులేని కోపం వచ్చింది దానిమీద. అమాయకమైన పాత దున్నపోతు అకాల మరణంపట్ల అందరూ దుఃఖితులయ్యారు. ముఖ్యంగా తోటి పశువుల దీనస్థితి వర్ణనాతీతం. ఇక రైతుల ఆవేదనకు అంతు లేదు.

అంతా నిలబడి మరణించిన దున్నపోతు ఆత్మశాంతికోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ తర్వాత న్యాయనిర్ణేతలు తమ తీరు ్ని ఈ విధంగా ప్రకటించారు

"పశువుల ప్రదర్శనలో జంతువులు (క్రూర) అక్రమంగా ప్రవేశించాయి. పోనీలే అనుకుంటే, విపరీతంగా ప్రవర్తించాయి ... (కొత్తదున్నపోతు వైపు చూపిస్తూ) ఇది మామూలు దున్నపోతు కాదు. అసాధారణమైన దున్నపోతు! దీనికి అసలు కావలసింది పచ్చనోట్ల తిండి! అది సహజమైన పశువు కాబట్టి విషం వలన చచ్చింది. ఇది వింత దున్నపోతు. దీనికి ఇచ్చేవి ఏమీ లేవు! అయినా ఉదరం నిమిత్తం కొద్దిగా ఒట్టిగడ్డి, పచ్చగడ్డి మాత్రం పడేస్తున్నాం! మరణించిన దున్నపోతుకి 'పశువీరచక్ర' అవార్డు ప్రకటిస్తున్నాం! రైతుకు బహుమతి మొత్తం లక్షరూపాయలతోపాటు మరో లక్ష నష్టపరిహారంగా ఇస్తున్నాం!"

ఆనందంతో అంతా చప్పట్లు కొట్టారు.

అయితే ఒక విషయం మాత్రం ఎవరికీ బోధపడలేదు. విషం తిన్న ఆ పశువు మరణించింది గానీ, అదే విషం తిన్న ఈ పశువు ఎలా బతికింది?

సమాధానం ఈ పశువు శరీరంలో ఉన్న విషాన్ని కృత్రిమ విషం ఏమీ చేయలేకపోయింది!

(ఇది కేవలం హాస్యంకోసం. ఎవరినీ ఉద్దేశించి కాదు అని మనవి!"

■

